క్లుప్తంగా

మంత్రి సీతక్కను కలిసిన టీపీసీసీ అధికార ప్రతినిధి



కమ్మర్‌పల్లి: మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన టీపీసీసీ అధికార ప్రతినిధి వేణు గోపాల్‌యాదవ్ మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



బోధన్: పట్టణంలోని విజయసాయి హైస్కూల్‌లో మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. క్లబ్ కోశాధికారి రాధాకృష్ణమూర్తి, ప్రతినిధులు గోపాల్‌రావు, శ్రీనివాస్‌రాజు, రామక్రిష్ణ, లక్ష్మికాంత్ రెడ్డి, ఐఆర్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

టోర్నీ నిర్వహించడం అభినందనీయం



బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్ గ్రామంలో గ్రామానికి చెందిన ఏలటి సంతోష్ రెడ్డి 70వ సీనియర్ బాలికల కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని డీసీసీబీ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయనను గ్రామంలో సన్మానించారు. ఎంపీటీసీ నడ్పన్న, ఉప సర్పంచ్ గంగారెడ్డి, శ్రీనివాస్, సాయన్న, భూమన్న, మార ముత్యం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్ విద్యార్థులకు మంగళవారం జిల్లా కేంద్రంలోని డైస్ కేంద్రంలో మండల ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో దంతవైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. వైద్య సిబ్బంది సూర్యనారాయణ, స్వరూపరాణి ఉన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్



బాల్కొండ: ముప్కాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా 370 మంది విద్యార్థులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. హెచ్‌ఎం గంగారాం మాట్లాడుతూ.. మాక్ పోలింగ్ ద్వారా ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన పెరుగుతుందన్నారు. ఎస్‌ఎంసీ చైర్మన్ శ్రీమాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరానికి చేరుకున్న 'విజయ యాత్ర'

నిజామాబాద్ సిటీ: జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి విజయ యాత్ర మంగళవారం రాత్రి నగరంలోని గంగాస్థాన్ ఉత్తర తిరుపతి క్షేత్రానికి చేరుకుంది. ఈసందర్భంగా ఉత్తర తిరుపతి క్షేత్రంలో నేడు, రేపు జరుగనున్న కార్యక్రమాలలో స్వామివారు పాల్గొని, భక్తులకు ప్రవచనాలు, దర్శనం ఇవ్వనున్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష దీపోత్సవం

ధర్పల్లి: మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో ధర్మకర్త రాజ గంగారాం ఆధ్వర్యంలో మంగళవారం లక్ష దీపోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో దీపాలను వెలిగించారు. ఆలయంలో పూజలు నిర్వహించారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని కాశీ విశ్వనాథ ఆలయం ఆవరణలో మంగళవారం అయ్యప్ప స్వామి వారి సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం అయ్యప్ప పడిపూజ వైభవంగా నిర్వహించారు. పండితులు రాజేందర్ త్రిపాఠి శర్మ ఆధ్వర్యంలో అయ్యప్ప, గణపతి, సుబ్రమణ్యస్వామి విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భిక్ష (అన్నదానం) ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, గురుస్వాములు మణికంఠ లక్ష్మీనర్సయ్య, నర్సయ్య, వెంకటరమణ, గంగారెడ్డి, మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, పాలసాని శ్రీనివాస్, వాసు, ధర్మాగౌడ్ పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో ఇంకెన్నాళ్లు!

- నూతన మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కరువు
- ఇబ్బందిపడుతున్న సిబ్బంది



ముప్కాల్ వీడీసీ భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

బాల్కొండ: పరిపాలన సౌలభ్యం కోసం గత ప్రభుత్వం నూతన మండలాలను ఏర్పాటు చేసింది. ఇందుకోసం మండల కేంద్రాల్లో ప్రభుత్వ కార్యాలయాలను అద్దె భవనాలు, ఇతర కార్యాలయాల్లో ఏర్పాటు చేసింది. కానీ ఏళ్లు గడుస్తున్నా కార్యాలయాలకు సొంత భవనాలు మంజూరు కాలేదు. దీంతో అద్దె భవనాల్లో ఇంకెన్నాళ్లు ఉండాలంటూ సిబ్బంది, ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొత్త సర్కార్‌లోనైన కార్యాలయాలకు పక్కా భవనాల మంజూరవుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

కనీస సౌకర్యాలు లేవు..

మెండోరా మండల కేంద్రంలో కూడ కార్యాలయాలకు పక్కా భవనాలు ఇప్పటికీ దిక్కు లేదు. మండల పరిషత్ కార్యాలయం ప్రాథమిక పాఠశాలలో, పోలీస్‌స్టేషన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవనంలో, తహసీల్దార్ కార్యాలయం అద్దె భవనంలో, వ్యవసాయ అధికారి కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతున్నాయి. ఏ కార్యాలయంలో కూడ సరైన సౌకర్యాలు లేవు. పోలీస్‌స్టేషన్‌లో మూడు గదులు మాత్రమే ఉన్నాయి. మండల పరిషత్‌లో రెండు గదుల్లో అన్ని విభాలు నిర్వహించాల్సి వస్తోంది. ఇప్పటికైనా నూతన ప్రభుత్వ పాలకులు, అధికారులు స్పందించి నూతన మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ముప్కాల్, మెండోరా మండలాల్లో..

ఉమ్మడి బాల్కొండ మండలం నుంచి గత ప్రభుత్వం ముప్కాల్, మెండోరా మండలాలను ఏర్పాటు చేసింది. మండలాలను ఏర్పాటు చేసి ఏడుసంవత్సరాలు కావస్తున్నా ఇప్పటికీ కార్యాలయాలకు పక్కా భవనాలు లేవు. అద్దె భవనాల్లో కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ముప్కాల్ మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం వీడీసీ భవనంలో, పోలీస్ స్టేషన్ మత్స్యకారుల సంఘ భవనంలో, మండల పరిషత్ గ్రామ పంచాయతీ కార్యాలయం పైభాగాన, వ్యవసాయ అధికారి కార్యాలయం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గదిలో నిర్వహిస్తున్నారు.

ఇందులో తహసీల్దార్ కార్యాలయం, మత్స్య సహకార సంఘ భవనాలకు అద్దె చెల్లిస్తున్నారు. అద్దె చెల్లిపు కూడ సకాలంలో లేకపోవడంతో అధికారుల చుట్టు ప్రదక్షిణ చేయాల్సి వస్తుందని వీడీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న భవనాల్లో వసతులు సరిగా లేకపోవడంతో ప్రజలు కూడ తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

యూవీకెన్ సేవలు అభినందనీయం



నిరుపేదలకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నవీపేట: నిరుపేదలకు అండగా నిలుస్తున్న యూవీకెన్ సేవలు అభినందనీయమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి కొనియాడారు. క్రికెటర్ యువరాజ్ సింగ్ పుట్టిన రోజు సందర్భంగా యూవీకెన్, యూవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని జన్నెపల్లి గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, నోట్ పుస్తకాలను అందజేశారు. అలాగే 20 నిరుపేద కుటుంబాలకు రూ. 5వేల చొప్పున నగదు మరో 25 కుటుంబాలకు 25కిలోల చొప్పున బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే భూపతిరెడ్డి హాజరై, మాట్లాడారు. సిరన్‌పల్లి గ్రామానికి చెందిన యువరాజ్ సింగ్ వీరాభిమాని దొడ్డి సుజన్‌రావ్ సొంతంగా యూవీకెన్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవలు నిర్వహించాలని, అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఫౌండేషన్ చైర్మన్ సుజన్‌రావ్, సర్పంచులు సబిత సంజీవ్‌రావ్, సుధాకర్‌రావ్, నాయకులు గడుగు గంగాధర్, తాహెర్, మానాల మోహన్‌రెడ్డి, అంతిరెడ్డి రాజిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, బాబు, రాజు, ప్రదీప్‌రావ్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీడీఎస్‌ల సమస్యలు పరిష్కరించండి



ఆర్మూర్ పోస్టాఫీసు ఎదుట సమ్మె చేస్తున్న తపాలాశాఖ ఉద్యోగులు

- గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మె



బోధన్ పట్టణంలో..

ఆర్మూర్‌టౌన్: తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని గ్రామీణ తపాలా ఉద్యోగులు(జీడీఎస్) డిమాండ్ చేశారు. ఈమేరకు ఆర్మూర్‌లో మంగళవారం వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న తపాలా సిబ్బంది బీపీఎం, ఏబీపీఎంలు సమ్మె నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర నాయకులు లింబాగౌడ్, సబ్ డివిజన్ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో, రిటైర్మెంట్ తర్వాత పెన్షన్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. తపాలా సేవలు విస్తృతం చేయడానికి ఆర్‌ఐసీటీ డివైజ్‌లను ఉపసంహరించి, తపాలశాఖలకు ఇవ్వాలన్నారు. రమేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంత్, వెంకటేష్, రవీందర్, జగదీశ్, వేణు ఉన్నారు.

బోధన్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు మంగళవారం పట్టణంలో సమ్మె చేపట్టారు. తమకు 8గంటల పని దినం విధానం అమలు చేయాలని, పెన్షన్‌తో పాటు అన్ని ప్రయోజనాలను మంజూరు చేయాలని కోరారు. ఇతర డిమాండ్లను నెరవేర్చాలని తెలిపారు. ఉద్యోగులు సాయిలు, అశోక్‌రెడ్డి, గంగాధర్ పటేల్, పాషా, సునిల్, వందన, భాస్కర్, యోగేష్, శంకర్ పాల్గొన్నారు.

ఎంపీ ధీరజ్ సాహూపై చర్యలు తీసుకోవాలి



ఆర్మూర్‌లో ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మాక్లూర్/ఆర్మూర్‌టౌన్/రుద్రూర్/పోతంగల్(రుద్రూర్): జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహూపై చర్యలు తీసుకోవాలని, కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మాక్లూర్, ఆర్మూర్, రుద్రూర్, పొతంగల్‌లో మంగళవారం బీజేపీ నాయ కులు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ధీరజ్ సాహూ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. ఎంపీ ధీరజ్ సాహూ ఇంట్లో ఆదాయపు పన్నుశాఖ నిర్వహించిన దాడుల్లో రూ.350 కోట్ల నల్లధనం లభ్యం కావటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. ధీరజ్ సాహు వంటి అవినీతిపరులను పార్టీ నుంచి వెంటనే సస్పెండ్ చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌కు వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. నాయకులు గంగోనే సంతోష్, రాజు, సురేష్, రమేష్, ద్యాగ ఉదయ్, జెస్సు అనిల్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, ఆకుల రాజు, దోండి ప్రకాష్, శ్రీను, ఆలపాటి హరికృష్ణ, యముల గజేందర్, తోట శంకర్, శివప్రసాద్, కృష్ణంరాజు, వినోద్ కుమార్, గంగాధర్, గణేష్, కన్నె శ్రీనివాస్, వంజరి శ్రీనివాస్, సాయికుమార్, ప్రకాష్ పటేల్, అశోక్, హరి, సాయిలు, హన్మాండ్లు పాల్గొన్నారు.



మాక్లూర్‌లో..



రుద్రూర్‌లో..

మెనూ ప్రకారం భోజనం అందించాలి



బాల్కొండ: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని బాల్కొండ విద్యాశాఖ అధికారి రాజేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిరావు పూలే బాలికల పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాలలో విద్యార్థుల భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. ఉపాధ్యాయు లు, సిబ్బంది ఉన్నారు.

రేపు లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



ఆర్మూర్‌టౌన్: మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో ఈనెల14న ఆగ్గు స్వామి మహారాజ్ ఆధ్వర్యంలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం, జాతర నిర్వహించనున్నట్లు ఆలయ సేవకులు తెలిపారు. ఈమేరకు మంగళవారం కార్యక్రమ ఆహ్వాన పత్రికను ఆర్మూర్‌లోని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్‌కు అందజేశారు. ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామివారిని దర్శించుకోవాలని నిర్వాహకులు కోరారు.

బాలల హక్కులపై అవగాహన



రుద్రూర్: కోటగిరి హైస్కూల్‌లో మంగళవారం మహిళ శిశు సంక్షేమ శాఖ, వైద్య, విద్య, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. బాలలపై లైంగిక వేధింపులు, మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాల్యవివాహాలు, లైంగిక వేధింపులకు పాల్పడితే షీటీం హెల్ప్‌లైన్‌కు సంప్రదించాలన్నారు. విద్యార్థులు ఆరోగ్యం, చదువు, క్రీడలపై ప్రతేక శ్రద్ధ చూపాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అధికారులు గోవర్ధన్, షౌకత్ బేగం, సుమలత, సాయికుమారి, కొత్తపల్లి రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి సంజయ్ అండర్–14 రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రవికుమార్ తెలిపారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. నేటి నుంచి 15 వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో సంజయ్ పాల్గొంటారన్నారు.

బాన్సువాడ ఎమ్మెల్యేకు సన్మానం



బాన్సువాడ ఎమ్మెల్యే పోచారంను సన్మానిస్తున్న మహిళ ప్రజాప్రతినిధులు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గిరిజనులు

రుద్రూర్: బాన్సువాడ ఎమ్మెల్యేగా విజయం సాధించి, ప్రమాణస్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా నియోజకవర్గానికి విచ్చేసిన పోచారం శ్రీనివాస్ రెడ్డిని మంగళవారం రుద్రూర్ మండల మహిళ ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. తనకు శుభాకాంక్షలు తెలిపిన మహిళ ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. ఎంపీపీ అక్కపల్లి సుజాత నాగేందర్, సర్పంచ్‌లు తిగుల్ల గంగామణి ప్రసాద్, కోర్వ భాగ్య భూషణ్, రోజా లక్ష్మణ్, ఎంపీటీసీలు మంత్రి లక్ష్మీ గంగారం, పత్తి సావిత్రి సాయిలు, భాగ్య ఉన్నారు.

వర్ని: బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని మంగళవారం మండలంలోని పొట్టిగుట్ట తండా గిరిజనులు సన్మానించారు. మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గోపాల్, నాయకులు గిరి, జాకోరా సహకార సంఘం అధ్యక్షుడు కష్టారెడ్డి, ఎంపీటీసీ సాయిలు, హీరా సింగ్, ధూప్ సింగ్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలి

కోటగిరి (రుద్రూర్): బాన్సువాడ ఎస్‌ఎంబీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఉదయం నిర్వహించనున్న నియోజక వర్గ బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని రుద్రూర్, కోటగిరి మండలాల బీఆర్‌ఎస్ అధ్యక్షులు పత్తి లక్ష్మణ్, ఎజాజ్‌ఖాన్ ఒక ప్రకటనలో కోరారు. మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలి



ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ నియోజకవర్గంలో విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులకు ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి సూచించారు. అంకాపూర్‌లో మంగళవారం ఎమ్మెల్యేను ఆర్మూర్ డివిజన్ విద్యుత్ శాఖ అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలపై అధికారులతో చర్చించారు. ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్, విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజినీర్ హరిచంద్, ఏడీఈలు శ్రీధర్, రాజేశ్వర్, ఏఈలు అశ్రిత రెడ్డి, శ్రావణ్, భాస్కర్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

అక్రమ కేసులను వెనక్కి తీసుకోండి



కలెక్టర్‌కు విన్నవిస్తున్న నాయకులు

సుభాష్‌నగర్: రైతు నాయకులపై కక్షపూరితమైన వైఖరి అవలంభిస్తూ అక్రమ కేసులు, నిర్బంధించడం, నియంతృత్వంగా వ్యవహరించడాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఎస్‌కేఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం వారు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏఐపీకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి దేవరాం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రైతాంగం ఐక్యంగా పోరాటాలు చేస్తూ మోదీ ప్రభుత్వానికి బుద్ధిచెప్తామన్నారు. నాయకులపై పెట్టిన కేసులు వెనక్కి తీసుకోవాలని కోరారు. నాయకులు భాస్కర్, వెంకటేష్, రాజేశ్వర్, భూమయ్య, భాస్కర్, బాబన్న, కిషన్, అశోక్, పెద్ది వెంకట్రాములు, సాయాగౌడ్, గంగారాం, సాయిరెడ్డి, నజీర్, డి గంగాధర్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



నిరసన తెలుపుతున్న డ్రైవర్లు

ఎడపల్లి: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో తమకు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నామని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఎడపల్లిలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డిలు ఆటో నడిపే మమ్మల్ని ఆదుకోవాలని కోరారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

- స్క్రీన్-1 – ఎక్స్‌ట్రా ఆర్డినరి మెన్ (తెలుగు)-9.40; యానిమల్ (హిందీ) 1.00, 5.00, 9.00
- స్క్రీన్-2 – హాయ్ నాన్న (తెలుగు)- 09.30, 12.45, 4.00, 7.15, 10.30
- స్క్రీన్-3 – ఎక్స్‌ట్రా ఆర్డినరి మెన్ (తెలుగు)- 11.50, 3.10, 6.30, 9.50
- స్క్రీన్-4 – యానిమల్(తెలుగు)- 10.00, 2.00, 6.00, 9.00

ఎమ్మెల్యేలను కలిసిన టీఎన్‌జీవోలు





అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ను సన్మానిస్తున్న టీఎన్‌జీవో నాయకులు.. భూపతిరెడ్డిని సన్మానిస్తూ..

సుభాష్‌నగర్: నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డిని ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా చైర్మన్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ ఆధ్వర్యంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శాలువా, పుష్పగుచ్ఛంతో ఎమ్మెల్యేలను సన్మానించారు. ఉద్యోగుల సమస్యలు, తదితర అంశాలు వారితో ప్రస్తావించారు. టీజీవో జిల్లా అధ్యక్షుడు సంగం అమృత్‌కుమార్, టీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, సహాధ్యక్షుడు చిట్టి నారాయణరెడ్డి, కేంద్ర సంఘం బాధ్యులు పోల శ్రీనివాస్, సతీష్‌కుమార్, నాయకులు ఆకుల ప్రసాద్, జాన్ సుధాకర్, సంజీవయ్య, జాకీర్ హుస్సేన్, దినేష్ బాబు, మహేందర్ పాల్గొన్నారు.

'సాంఘిక బహిష్కరణ విధించారు'



బాల్కొండ: మండలంలోని బస్సాపూర్ గ్రామానికి చెందిన ఆదివాసి నాయక్‌పోడు కులస్తులను గ్రామానికి చెందిన మున్నూరుకాపు సంఘం సాంఘిక బహిష్కరణ చేశారని వారు ఆరోపించారు. ఈ ఘటనపై వారు మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేయుటకు తరలివెళ్లారు. ఈసందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. గ్రామంలో పాత గ్రామ పంచాయతీ భవనాన్ని కూల్చి, అదే స్థలంలో నూతన గ్రామ పంచాయతీ భవనం నిర్మాంచాలని ముందుగా గ్రామస్తులు నిర్ణయించారు. కానీ గ్రామానికి చెందిన మున్నూరు కాపు సంఘ సభ్యులు ఆ స్థలంలో సంఘ భవనం నిర్మించుకుంటున్నారన్నారు. దీనిని వ్యతిరేకించినందుకు తమను సాంఘిక బహిష్కరణ చేశారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. నారి గంగాధర్, చిన్నయ్య, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిజామాబాద్ అర్బన్ & రూరల్ రాంనాథ్ : 7997958181
ఆర్మూర్ శివ : 9848956776
బాల్కొండ ప్రశాంత్ : 8919850800
బోధన్ కృష్ణ : 7997958178
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899